
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అల్లూరి సీతారామరాజు జిల్లా వార్తలు
శనివారం 17 ఆగస్టు 2024



రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, ఆగస్టు 16:
జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పల స్వామి తెలిపారు. ఈనెల 21 వరకు రంపచోడవరం, చింతపల్లి, పాడేరు, అరకు డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా రెండు నుంచి గరిష్ఠంగా పది మిల్లీమీటర్లు వర్షపాతం నమోదవుతుందన్నారు. రైతులు వర్షాలు తగ్గిన తరువాత పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

అధ్వానంగా

ఆ రహదారిపై ప్రయాణమంటేనే హడల్

- అడుగడుగునా భారీ గోతులు
- ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం
- ఇచ్చిన హామీని నిలబెట్టుకోని గత పాలకులు
- ఆదివాసీలకు తప్పని రవాణా కష్టాలు

రాళ్లగెడ్డ-లోతుగెడ్డ రోడ్డు

చింతపల్లి, ఆగస్టు16:
మండలంలోని ఆంధ్ర, ఒడిశా సరిహద్దు బలపం కోరుకొండ ప్రాంతానికి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రయాణమంటే గిరిజనులు హడలెత్తిపోతున్నారు. రాళ్లగెడ్డ నుంచి లోతుగెడ్డ బ్రిడ్జి వరకు రోడ్డు అత్యంత అధ్వానంగా తయారైంది. అడుగడుగున భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో ప్రయాణించిన వాహనాలు మరమ్మతులకు గురువుతున్నాయి. రహదారిపై ఏర్పడిన చిన్నపాటి గుంతలను పూర్చేందుకు వైసీపీ ప్రభుత్వ పాలకులు, అధికారులు కనీసం స్పందించకపోవడంతో ప్రస్తుతం భారీ గోతులు ఏర్పాడ్డాయి. దీంతో ప్రాంతీయ ఆదివాసీలకు రవాణ కష్టాలు తప్పడంలేదు.


మేడేరు జంక్షన్ వద్ద గుంతలు

ఆంధ్ర, ఒడిశా ప్రజలను కలిపే రోడ్డు

లోతుగెడ్డ-మూలగరువు కొత్తూరు రహదారి ఆంధ్ర, ఒడిశా ప్రజలను కలిపే ప్రధాన రహదారి. మండలంలోని బలపం, కుడుముసారి, తమ్మంగుల పంచాయతీలకు చెందిన 89 గ్రామాల ఆదివాసీలు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ పరిధిలో మూడు పంచాయతీల ప్రజలకు కూడా ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి అత్యంత అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డును పదేళ్ల క్రితం నిర్మించారు. నాలుగేళ్ల క్రితం ఈ రహదారిపై చిన్నపాటి గోతులు ఏర్పడ్డాయి. సకాలంలో వైసీపీ ప్రభుత్వ పాలకులు గోతులను పూడ్చకపోవడంతోప్రస్తుతం ఈ రహదారి అత్యంత దయనీయ స్థితికి చేరుకున్నది. లోతుగెడ్డ బ్రిడ్జి నుంచి రాళ్లగెడ్డకు వరకు ఎనిమిది కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రోడ్డుపై అడుగడుగున భారీ గోతులు ఏర్పడ్డాయి. కొన్నిచోట్ల రహదారి ఆనవాళ్లు కనిపించడం లేదు. ఈ రహదారిపై ఒక్కొక్క గొయ్యి ఒకటి, రెండు అడుగుల లోతులో ఉన్నాయి. ఈ కారణంగా ప్రాంతీయ ఆదివాసీలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.


లోతుగెడ్డ-రాళ్లగెడ్డ రహదారి దుస్థితి

ప్రజలకు రవాణా కష్టాలు..

లోతుగెడ్డ-మూలగరువు కొత్తూరు రహదారిపై ప్రయాణించేందుకు ఆదివాసీలకు రవాణ కష్టాలు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సు, సర్వీసు జీపులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు అతికష్టంపై రాకపోకలు సాగిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. సర్వీసు ఆటోలు, జీపులు రెండు రోజులు ఈ మార్గంపై ప్రయాణిస్తే మరమ్మతులకు గురవుతున్నాయని డ్రైవర్లు వాపోతున్నారు.

ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ పాలకులు

రాళ్లగెడ్డ-లోతుగెడ్డ బ్రిడ్జి వరకు రహదారిని మరమ్మతులు చేసేందుకు ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వ పాలకులు, అధికారులు కనీసం పట్టించుకోలేదు. రెండేళ్ల క్రితం బలపంలో జగన్న సురక్ష, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన నాటి ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, వైసీపీ నేతలు దృష్టికి స్థానికులు రహదారి సమస్యను తీసుకు వెళ్లారు. రహదారి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినప్పటికి నేటి వరకు కార్యరూపం దాల్చలేదు. కనీసం గోతులను సైతం పూడ్చే పనులు చేపట్టలేదు. ఈ రహదారి సమస్యను కొంతమంది ఉద్యోగులు ఏడాది క్రితం నాటి ఎస్టీ కమిషన్ సభ్యుడు, ప్రస్తుత ఎమ్మెల్సీ కుంభా రవిబాబు దృష్టికి తీసుకొని వెళ్లారు. ఈమార్గంలో నిత్యం రాకపోకలు సాగించే ఉపాధ్యాయులు సమస్యను వీడియో రూపంలో చిత్రీకరించి ఆయనకు వివరించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతానని, సాధ్యమైనంత వేగంగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కానీ మరమ్మతులు చేపట్టలేదు. రహదారి నిర్మాణాలపై ఎన్డీయే కూటమి ప్రభుత్వంపైనే ఈ ప్రాంత ప్రజలు ఆశలు పెంచుకున్నారు.

మన్యంలో కుండపోత

తడిచి ముద్దయిన ఏజెన్సీ...


పాడేరు మెయిన్‌రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

- రోడ్లన్నీ జలమయం
- జన జీవనానికి అంతరాయం

పాడేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):
మన్యంలో శుక్రవారం మధ్యాహ్నం కుండపోతగా వర్షం కురిసింది. ఏజెన్సీ వ్యాప్తంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాధారణ వాతావరణం కొనసాగింది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత వాతావరణం మారిపోయి ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రం పాడేరుతోపాటు ఏజెన్సీ వ్యాప్తంగా ఏకధాటిగా గంటన్నరపాటు కురిసింది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలయమం కాగా గెడ్డల్లోకి వర్షం నీరు భారీగా చేరింది. పట్టణంలోని మురుగుకాల్వలు సైతం వర్షం నీటితో ప్రవహించాయి. జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పాడేరు, అరకు వారపు సంతలకు ఆటంకం కలగడంతో వర్తకులు, రైతులు, వినియోగదారులు అవస్థలు పడ్డారు. సుమారు గంటన్నర భారీ వర్షం కురవగా.. ముసురు వాతావరణం కొనసాగుతున్నది.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ

బొత్స ఏకగ్రీవ ఎన్నిక

- కోడ్ ఎత్తివేతకు ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు


విలేకరులతో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):
ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఎన్నికల ప్రక్రియ ముగిసింది. పోటీలో వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఒక్కరే ఉండడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు శుక్రవారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రకటించారు. అనంతరం తన ఛాంబర్‌లో బొత్సకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. బొత్స సత్యనారాయణ 2027 డిసెంబరు ఒకటో తేదీ వరకూ ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు. ఇదిలావుండగా ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల సంఘానికి రిటర్నింగ్ అధికారి నివేదిక పంపారు. ఒకటి, రెండు రోజుల్లో కోడ్ ఎత్తివేతకు సంబంధించి ఆదేశాలు వెలువడనున్నాయి. ఎన్నికల కమిషన్ నుంచి అధికారికంగా ఉత్తర్వులు వచ్చిన తరువాత యథావిధిగా అభివృద్ధి/సంక్షేమ కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకోనున్నారు. ఇంకా అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు

... మిగతా 6వ పేజీలో

ఘాట్ రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు

అధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం


వివిధ శాఖల అధికారులతో సమావేశమైన కలెక్టర్ దినేశ్‌కుమార్, చిత్రంలో ఎస్పీ అమిత్‌బర్దార్

పాడేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):
రోడ్డు ప్రమాదాల నివారణకు ఘాట్ మార్గాలను విస్తరించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రతపై అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పాడేరు, కొక్కిరాపల్లి, లంబసింగి, డౌనూరు ఘాట్ రోడ్లను విస్తరించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఘాట్ మార్గాల్లో భారీ వాహనాలు కాకుండా జీపులు, 30 లేదా 40 సిటింగ్ ఉండే మినీ బస్సులను నడిపేందుకు గల అవకాశాలను పరిశీలించాలని, అందుకు ఒక ప్రాంతాన్ని ఎంచుకుని ట్రైయిల్ రన్ నిర్వహించాలన్నారు. అలాగే ఘాట్ మార్గాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఘాట్ ప్రాంతాల్లోని ప్రయాణిలు, పర్యాటకులు చేయాల్సినవి, చేయకూడనివి ప్రస్తావిస్తూ బోర్డులను పెట్టాలన్నారు. ప్రమాద రహిత డ్రైవర్లకు ప్రోత్సాహకాలు అందించాలన్నారు. ప్రైవేటు వాహనాల డ్రైవర్ల వివరాలను సేకరించాలన్నారు. అలాగే జీపులు, ఇతర ప్రైవేటు వాహనాలు ఓవర్ లోడింగ్‌కు ఆస్కారం లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఏదైనా ప్రమాదంలో ముగ్గురు కంటే ఎక్కువ మంది మృతి చెందిన ఘటనలపై అధ్యయనం చేసి, తద్వారా ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను గుర్తించాలన్నారు.

ఇతర ప్రాంతీయులు గుర్తించేలా బోర్డులు : ఎస్పీ

ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ఇతర ప్రాంతీయులు గుర్తించేలా బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ అన్నారు. బోర్డుల ఏర్పాటుతో కొత్త ప్రయాణికులు ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో అప్రమత్తమవుతారన్నారు. అలాగే తమ ప్రాంతంలోని రోడ్డు ప్రమాదాల వివరాలను తెలుసుకునేందుకు ఆస్పత్రులకు అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రవాణాధికారి లీలాప్రసాద్, ఎంవీఐ రాజేశ్, పీటీడీ డీఎం పి.శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ సి.జమాల్ బాషా, పంచాయతీరాజ్ ఈఈ టి.కొండయ్యపడాల్, రోడ్లు, భవనాల శాఖ ఈఈ బాల సుందరబాబు, నేషనల్ హైవే అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా బదిలీ


రాహుల్ మీనా

చింతూరు, ఆగస్టు 16: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీరజ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాహుల్ మీనా గత ఏడాది మే1న చింతూరు ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. రాహుల్‌మీనాకు పదోన్నతి కల్పిస్తూ ఎస్ఆర్‌పీ గుంతకల్ ఎస్పీగా బదిలీ చేశారు. 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన పంకజ్‌కుమార్ మీనాకు చింతూరు ఏఎస్పీగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పంకజ్ కుమార్ మీనా ఇప్పటివరకు గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండర్‌గా విధులు నిర్వర్తించారు.

పాడెపై ఇంటికి మృతదేహం

- రోడ్డు లేక మూడు కిలోమీటర్ల దూరంలో ఆగిన అంబులెన్స్
- డోలీ కట్టినా తరలించేందుకు వీలుపడని వైనం
- పాడె కట్టి మోసుకెళ్లిన కుంబుర్ల గ్రామస్థులు


మరణించిన వంతాల గంగమ్మ(ఫైల్)


గంగమ్మ మృతదేహాన్ని పాడెపై గ్రామానికి తరలిస్తున్న కుంబుర్ల గ్రామస్థులు

పెదబయలు, ఆగస్టు 16 :
ఎక్కడైనా మృతదేహాన్ని ఇంటి నుంచి శ్మశానానికి తీసుకెళ్లేందుకు పాడె కడతారు. కానీ ఆ గ్రామస్థులు మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు పాడె కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే..

విశాఖపట్నం కేజీహెచ్‌లో మృతురాలిని స్వగ్రామం తరలించేందుకు గ్రామస్థులు అష్టకష్టాలు పడ్డారు. మండలంలోని బొంగరం పంచాయతీ కుంబుర్ల గ్రామానికి చెందిన వంతాల గంగమ్మ(29) కొద్ది రోజుల క్రితం కిడ్నీ సంబంధిత వ్యాధితో విశాఖపట్నం కేజీహెచ్‌లో చేరింది. ఆమె చికిత్స పొందుతూ ఆగస్టు 14వ తేదీ మధ్యాహ్నం మరణించింది. గంగమ్మ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఆస్పత్రి యాజమాన్యం సకాలంలో అంబులెన్స్ ఇవ్వలేదు. అదే రోజు రాత్రి అంబులెన్స్ ఇవ్వడంతో కేజీహెచ్ వద్ద బయలుదేరి ఆగస్టు 15వ తేదీ తెల్లవారు జామున 5 గంటలకు బొంగరం పంచాయతీ పరిధిలోని డి.కొత్తూరు గ్రామానికి చేరుకుంది. అక్కడి నుంచి కుంబుర్ల గ్రామానికి రహదారి లేకపోవడంతో అంబులెన్స్ ఆగిపోయింది.

దీంతో గంగమ్మ మృతదేహాన్ని తీసుకువెళ్లేందుకు డోలీని తయారుచేశారు. డోలిపై తీసుకువెళ్లేందుకు కుదరకపోవడంతో కర్రలతో పాడే తయారు చేసి మృతదేహాన్ని మూడు కిలోమీటర్ల మేర కొండలు, కోనలు దాటుకుంటూ గ్రామానికి తీసుకెళ్లారు. గంగమ్మకు భర్త, ముగ్గురు సంతానం ఉన్నారు. ఆమె మృతితో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. అధికారులు స్పందించి తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కుంబుర్ల గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు వైద్య సేవలు బంద్

అత్యవసర సేవలు, శస్త్రచికిత్సలు మినహా మిగిలినవన్నీ నిలిపివేస్తున్నట్టు వైద్య సంఘాల ప్రకటన

- కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసన
- సంఘీభావాన్ని ప్రకటించిన ఇతర అసోసియేషన్లు, వైద్య, అనుబంధ సంఘాల ప్రతినిధులు
- విద్యార్థి, ప్రజా సంఘాల మద్దతు
- రిలే దీక్షలు, ర్యాలీల నిర్వహణ
- కేజీహెచ్ సహా ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


విశాఖపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ప్రజాసంఘాల ప్రతినిధులు

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):
కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ (ఐఎంఏ) వైద్య సేవల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం ఉదయం ఆరు నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు వైద్య సేవలను నిలిచిపో నున్నాయి. అత్యవసర వైద్య సేవలు మినహా మిగిలిన ఓపీ, ఐపీ, స్కానింగ్, రక్త, ఇతర పరీక్షలను 24 గంటలపాటు ఆపివేయనున్నారు. ప్రభుత్వ వైద్యుల సంఘం, ఏపీ రేడియాలజిస్ట్ అసోసియేషన్, ఏపీ ప్రైవేటు నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్, ఏపీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్, జూనియర్ వైద్యుల సంఘం, పలు విద్యార్థి, ప్రజా సంఘాలు బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ప్రభుత్వ ఆస్పత్రులతోపాటు ప్రైవేటు హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, క్లినిక్స్‌లో కూడా 24 గంటలపాటు సేవలను నిలిపివేయనున్నారు. అత్యవసర వైద్య సేవలు, శస్త్ర చికిత్సలను మాత్రం నిర్వహిస్తామని ఐఎంఏ ప్రకటించింది.

నిరసన కార్యక్రమాలు

జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించనున్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దీక్షలు నిర్వహిస్తారు. ఉదయం మానవహారం, ఆర్‌టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ మీదుగా జీవీఎంసీ కార్యాలయం ఎదుటగల గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తారు. వైద్య విద్యార్థినికి జరిగిన అన్యాయంపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేయనున్నట్టు జూనియర్ వైద్యులు సంఘం సలహాదారు జహంగీర్ పేర్కొన్నారు. కోల్ కతాలో మృతిచెందిన వైద్య విద్యార్థినికి న్యాయం జరిగేంత వరకు తమ నిరసన కొనసాగుతుందన్నారు. నిందితులను తక్షణమే ఉరి తీయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ప్రభుత్వ ఆస్పత్రులు

జూనియర్ వైద్యులతోపాటు

... మిగతా 6వ పేజీలో

డిసెంబరులోగా సెల్ టవర్లు ఏర్పాటు

సెల్ నెట్‌వర్క్ అధికారులకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశం

- రోడ్లు దెబ్బతినకుండా ఆప్టికల్ కేబుళ్లు వేయాలి
- పూర్తి సహకారాన్ని అందిస్తాం..
- గ్రామాలకు సెల్ నెట్‌వర్క్ సదుపాయం


సెల్ నెట్‌వర్క్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో సెల్ టవర్ల నిర్మాణంలో భాగంగా ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు వేస్తున్నప్పుడు రోడ్లు దెబ్బతినకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో సెట్ టవర్ల నిర్మాణంపై సెల్ నెట్‌వర్క్ అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఏడాది డిసెంబరు నాటికి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సెల్ టవర్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, వాటి నిర్మాణానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సెల్‌టవర్ల నిర్మాణం చేపడుతున్న క్రమంలో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాలకు సెల్ నెట్‌వర్క్ సదుపాయాల కల్పిస్తే టీచర్ల బయోమెట్రిక్ హాజరు, అంగన్‌వాడీలకు సరుకుల పంపిణీ సక్రమంగా జరుగుతుందన్నారు. బీఎస్ఎన్ఎల్ మొత్తం 938 టవర్లకు గానూ ప్రస్తుతం 112 టవర్లకు మాత్రమే సిగ్నల్స్ సదుపాయం కల్పించారని, మిగిలిన 739 టవర్లను ఎప్పుడు అందుబాటులోకి తెస్తారని కలెక్టర్ ప్రశ్నించారు. అలాగే ఆయా టవర్లను డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్నారు. పెదబయలు మండలం బూరుగుపుట్టు, మారేడుమిల్లి మండలం గుడిస ప్రాంతాల్లో టవర్ల భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి

... మిగతా 6వ పేజీలో

క్రైం... crime news

వివాహిత ఆత్మహత్య

- చీరకు పసిపాపను కట్టుకొని అఘాయిత్యం
- రెండు రోజుల తర్వాత పొదల్లో నుంచి ఏడ్చుకుంటూ పాప రావడంతో బయటపడిన ఘటన
- క్లూస్ టీమ్ పరిశీలన
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన సీఐ

అరకులోయ, ఆగస్టు 16: మండలంలోని పానిరంగణి గ్రామం రహదారి పక్కన పొదల్లో వివాహిత ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తన రెండేళ్ల కుమార్తెను చీరకు కట్టుకొని అఘాయిత్యానికి పాల్పడింది. రెండు రోజులు తర్వాత పాప ఏడ్చుకుంటూ బయటకు రావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి.

అరకులోయకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పానిరంగిణి గ్రామం ప్రధాన రహదారి పక్కనే పొదల్లో వివాహిత ఉరివేసుకుని మృతి చెందింది. పద్మాపురం గ్రామానికి చెందిన పాంగి పద్మ(26) బుధవారం ఉదయం పద్మాపురం నుంచి రెండేళ్ల కుమార్తెతో కలిసి పానిరంగిణిలోని సోదరి ఇంటికి వచ్చింది. చాలా రోజుల తర్వాత రావడంతో సోదరి అన్ని మర్యాదలు చేసింది. తర్వాత వారు కూలి పనులకు అరకులోయకు వచ్చేశారు. సాయంత్రం ఇంటికి తిరిగి ఇంటికి వెళ్లేటప్పటికి పద్మ కనిపించకపోవడంతో పద్మాపురం వెళ్లిపోయిందని భావించారు. అయితే పద్మ తన రెండేళ్ల పాపను చీరకు కట్టుకొని పాణిరంగిణి గ్రామం ప్రధాన రహదారి పక్కనే పొదల్లో చిన్న చెట్టుకొమ్మకు ఉరివేసుకుంది. అయితే ఆ పాప పొదల్లో నుంచి శుక్రవారం ఉదయం ఏడ్చుకుంటూ బయటకు రావడంతో రోడ్డు పక్కనే ఉన్న ఇళ్ల వారు సపర్యలు చేశారు. పాపకు వంటినిండా దోమలు కుట్టిన ఆనవాళ్లు ఉన్నాయి. దీంతో పాపను ఎత్తుకుంటూ పొదల్లోకి వెళ్లి పరిశీలించగా పద్మ ఉరివేసుకొని మృతి చెంది ఉండడం కనిపించింది. చుట్టరికానికి వచ్చిన పద్మను వారు గుర్తించారు. దీంతో ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. అలాగే స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి సీఐ రుద్రశేఖర్, ఎస్ఐ సంతోష్ సిబ్బందితో చేరుకొని విచారణ జరిపారు. ఈ సంఘటనపై పద్మ బంధువులు మాత్రం ఆత్మహత్య కాదు.. తన భర్తే చంపేసి ఉంటాడంటూ ఆరోపించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. అనంతరం శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని అరకు ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా సీఐ రుద్రశేఖర్ విలేకర్లతో మాట్లాడుతూ.. మృతురాలికి తాగుడు వ్యసనం ఉందని, మానసిక పరిస్థితి సరిగ్గా లేదని తమ ప్రాథమిక విచారణలో తెలిసిందన్నారు. సంఘటనా స్థలంలో ఉన్న సీన్‌ను బట్టి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టే ఉందన్నారు. శవపరీక్షలో వాస్తవాలు వెలుగు చూస్తాయన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. పద్మ భర్త కొండను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సీఐ రుద్రశేఖర్ తెలిపారు.

రెండు రోజులు తల్లి చంకనే చిన్నారి

పద్మ బుధవారం సాయంత్రం మృతి చెంది ఉంటుంది. తన కుమార్తెను చీర పైటకు కట్టుకొని పాలు పెడుతూనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టుంది. తను ఏ సమయంలో ప్రాణం విడిచిందో తెలియదు గాని చెట్ల పొదలో దోమలు నడుమ పసిపాప నరకయాతన అనుభవించింది. పాప శరీరం అంతా దోమకాట్లతో నిండి వాచిపోయింది. చీరకట్టు నుంచి ఏ విధంగా బయట పడిందో తెలియదుగాని చంటి బిడ్డ బయటకు రావడంతోనే ఈ ఘటన వెలుగుచూసింది. రెండ్రోజులుపాటు పసిపాప మృతి చెందిన తల్లి చంకన ఏ విధంగా ఉందో ఆ భగవంతునికే ఎరుక అంటూ పలువురు వ్యాఖ్యానించారు. పసి పాప మృత్యుంజయురాలు అని పలువురు పేర్కొన్నారు.

30 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

ముంచంగిపుట్టు, ఆగస్టు 16: ఒక ఇంటిలో నిల్వ ఉంచిన గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ కె.రవీంద్ర అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బాబుసాల పంచాయతీ జడిగూడ గ్రామంలో ఓ ఇంటిలో గంజాయితరలించేందుకు సిద్ధంగా ఉంచినట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం పోలీసులు వెళ్లగా, వారిని చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన కొర్రా అస్సును పట్టుకున్నారు. అతని వద్ద రెండు బస్తాల్లో ఉన్న సుమారు 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కె.లక్ష్మయ్య, సిబ్బంది కె.రామారాజు, కె.వెంకటరావు, కె.మోహన్‌దాసు, వీఆర్‌వోలు భాస్కర్, పద్మారావు పాల్గొన్నారు.

వ్యక్తిపై చీటింగ్ కేసు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 16: కంపెనీకి డబ్బులు చెల్లించకుండా తన సొంతానికి వాడుకుని వినియోగదారులు చెల్లించలేదని చెబుతూ మోసం చేశాడనే సంఘటనపై ఒక వ్యక్తిపై గురువారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ జి. శంకరరావు తెలిపారు. ఫ్లిప్‌కార్ట్‌లో పనిచేస్తున్న ఎస్‌బీఐ కాలనీకి చెందిన సిహెచ్.లక్ష్మణ్ ఏడు ఫోన్లు, ఒక పర్సు వినియోగదారులకు విక్రయించి, వారి నుంచి తీసుకున్న రూ.98,332 కంపెనీకి చెల్లించలేదని గుంటూరుకు చెందిన షేక్ హుస్సేన్ ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఏడాది మార్చి నుంచి జూలై వరకు వీటి అమ్మకాలు చేసి కంపెనీ నుంచి ఎప్పుడు సమాచారం అడిగినా వినియోగదారుల ఆచూకీ తెలియడం లేదని చెబుతూ వస్తున్నాడని ఫిర్యాది హుస్సేన్ పేర్కొన్నారన్నారు. కంపెనీకి డబ్బులు చెల్లించకుండా సొంతానికి వాడుకుని మోసం చేసిన లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

మద్యం సీసాలతో ఒకరి పట్టివేత

కశింకోట, ఆగస్టు 16: మండలంలోని నర్సింగబిల్లి రైల్వే గేటు మీదుగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం తమకు వచ్చిన సమాచారం మేరకు నర్సింగబిల్లి రైల్వే గేటు వద్ద తనిఖీలు నిర్వహించగా మునగపాక మండలం చూచుకొండ గ్రామానికి చెందిన పెంటకోట గణేష్ మద్యంతో పట్టుబడ్డాడన్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా 45 క్వార్టర్ బాటిళ్లను కొనుగోలు చేసి తరలిస్తున్నట్టు తేలిందన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని గణేష్‌ను అరెస్టు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

పుస్తెల తాడు అపహరణ

కొత్తూరు, ఆగస్టు 16: వృద్ధురాలి మెడలో నుంచి నాలుగున్నర తులాల పుస్తెల తాడు అపహరించుకుపోయిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు శుక్రవారం తెలిపిన వివరాలివి. అనకాపల్లి మండలం సంపతిపురం పంచాయతీ చినసంపతిపురం గ్రామానికి చెందిన నక్కా నూకరత్నం తన నివాసానికి సమీప బంధువుల ఇంట్లో వివాహ కార్యక్రమానికి గురువారం రాత్రి వెళ్లారు. తిరిగి నివాసానికి వస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి మెడలో ఉన్న పుస్తెల తాడును తెంపుకొని పారిపోయారు. వీటి విలువ రూ.54 వేలు ఉంటుందని అంచనా వేశారు. ఈ సంఘటనపై వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు

జిల్లా టూరిజం కౌన్సిల్ ఏర్పాటు

అనకాపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా టూరిజం కౌన్సిల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో ఏడుగురు అధికారులు కాగా, ఐదుగురు నామినేటెడ్ సభ్యులు ఉంటారు. జిల్లా పర్యాటక శాఖాధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జిల్లా ఎస్పీ, జీవీఎంసీ జోనల్ కమిషనర్, జిల్లా అటవీ శాఖాధికారి, ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరక్టర్(విశాఖపట్నం), జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, జిల్లా విద్యా శాఖాధికారి, ఆర్కియాలజీ కన్జర్వేషన్ అసిస్టెంట్(విశాఖపట్నం), పద్మశ్రీ అవార్డు అందుకున్న ఏటికొప్పాక గ్రామ ప్రతినిధి, కళ్యాణి ఆర్ట్స్ అకాడమీ కరస్పాండెంట్, గాంధీ నగర్ యోగా శిక్షకులు, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసిసోయేషన్ ఏపీ అధ్యక్షులు విజయమోహన్, హోటలియర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పవన్ కార్తీక్ ఇందులో సభ్యులు. వీరంతా కలిసి పర్యాటక అభివృద్ధికి చర్యలు చేపడతారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	83.00
లైవ్ ధర	103.00
విత్ స్కిన్	176.00
స్కిన్ లెస్	186.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	495
విజయనగరం	499
శ్రీకాకుళం	499

చెత్త కదలదు.. కంపు వదలదు!

డంపింగ్‌యార్డు తరలింపునకు కలగని మోక్షం

- 12 ఏళ్లుగా జీవీఎంసీ కార్యాలయ ఆవరణలోనే..!
- భరించలేని దుర్వాసనతో పట్టణ ప్రజల అవస్థలు



జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో చెత్త కుప్పలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 16: **జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణ నడిబొడ్డున జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో ఉన్న డంపింగ్ యార్డు తరలింపునకు మోక్షం లభించడం లేదు. సుమారు 12 ఏళ్లుగా జీవీఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలోనే యార్డు కొనసాగుతోంది. భరించలేని దుర్వాసన వెదజల్లడంతో పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీని తరలింపునకు ప్రజా సంఘాలు ఎన్ని ఉద్యమాలు చేసినా ఫలితం లేకపోతోంది.**

పట్టణంలోని శారదానగర్‌లో ఉన్న డంపింగ్ యార్డును తొలగించాలని అక్కడి నివాసస్థులు గతంలో ఆందోళన చేపట్టారు. పట్టణంలో ఉత్పత్తయిన చెత్తను శారదానగర్‌లోని జీవీఎంసీ స్థలంలో ఉన్న యార్డుకు తరలించకుండా చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో డంపింగ్‌యార్డు ఏర్పాట్లకు అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ ఆయా ప్రాంతాల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో మరో మార్గం లేక పట్టణంలో ఉత్పత్తి అయిన చెత్తనంతటినీ జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో వేసి విశాఖకు తరలిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలతో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరుయాదవ్ అనేకసార్లు ఆందోళన చేపట్టినా ప్రయోజనం లేకపోయింది.

గత ఐదేళ్లూ చర్యలు శూన్యం

వైసీపీ ప్రభుత్వం పట్టణ నడిబొడ్డు నుంచి దూర ప్రాంతాలకు యార్డును తరలించే విషయంలో గత ఐదేళ్లూ ఏ విధమైన చర్యలు చేపట్టలేదు. కనీసం ఈ ప్రాంతవాసుల మొర వినిపించుకోలేదు. ఈ కంపోస్టు యార్డుకు ఆనుకుని అనేక నివాస గృహాలు, జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు, ఎండలు కాసినప్పుడు దుర్వాసనలతో వీరంతా అవస్థలు పడుతూ వస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో, తరువాత కూటమి నాయకులు ఈ యార్డును పరిశీలించి పట్టణ ప్రజలకు అనారోగ్యంగా మారిన డంపింగ్‌యార్డును పట్టణానికి దూరంగా తరలించాలని నిర్ణయించారు. గత నెలలో పోలవరం కాలువ పరిశీలించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి ఈ డంపింగ్ యార్డు సమస్యను కూటమి నాయకులు తీసుకువెళ్లారు. అంతేకాకుండా ఇటీవల అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశంలో కూడా స్వయంగా సీఎం చంద్రబాబునాయుడు డంపింగ్‌యార్డు విషయాన్ని సమీక్షలో ప్రస్తావించి పట్టణానికి దూరంగా తరలించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించినట్టు తెలిసింది. దీంతో జీవీఎంసీ జోనల్ కమిషనర్‌తో కలెక్టర్ చర్చించారు.

ఇదే సమయంలో విశాఖ ఉమ్మడిజిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్ రావడంతో డంపింగ్‌యార్డును తరలించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జాప్యం చోటు చేసుకుంటూ వచ్చింది. ఈ డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా ఏ ప్రాంతానికి తరలించాలనే ఆలోచనలో ప్రజా ప్రతినిధులతో సమీక్ష చేసి చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు. అయితే శుక్రవారం సాయంత్రంతో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియడంతో ఎంత వేగంగా యార్డు తరలింపుపై కదలిక వస్తుందోనని ఈ ప్రాంత వాసులు ఎదురు చూస్తున్నారు. యార్డును తరలించే పనిలో భాగంగా పట్టణానికి దూరంగా డంపింగ్‌యార్డుగా కాకుండా స్టాక్ పాయింట్‌గా పెట్టి అనకాపల్లిలో ఉత్పత్తి అయ్యే చెత్తను నిర్ధారించుకున్న ప్రదేశానికి తరలించి అక్కడి నుంచి భారీ వాహనాల పై చెత్తను విశాఖ కాపులుప్పాడలోని ప్రధాన డంపింగ్‌యార్డుకు తరలించే విధంగా అధికారులు ఆలోచనలు చేస్తున్నారు. అనకాపల్లి పట్టణంలో రోజుకు 80 నుంచి 90 టన్నులు వరకు చెత్త ఉత్పత్తి అవుతుందని శానిటేషన్ విభాగం అధికారులు చెబుతున్నారు. అయితే అనకాపల్లి నుంచి చెత్తను పూర్తి స్థాయిలో తొలగించకపోవడం వల్ల ఎప్పటికప్పుడు జోనల్ కార్యాలయం ఆవరణలో చెత్తకుప్ప దర్శనమిస్తున్నది. అయితే అధికారులు ఈ డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా ఎంత త్వరగా తరలించి తమ సమస్యలు పరిష్కరిస్తారోనని ఈ ప్రాంత వాసులు ఎదురు చూస్తున్నారు. అధికారులు కూడా తమ సమస్యలను దృష్టిలో పెట్టుకుని యార్డును వేగంగా తరలించాలని వారు కోరుతున్నారు.

గంజాయి నియంత్రణకు పటిష్ట చర్యలు

- జిల్లా ఎస్పీ ఎం.దీపిక



పోలీసులకు సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ

పాయకరావుపేట, ఆగస్టు 16: గంజాయి రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఎం.దీపక ఆదేశించారు. శుక్రవారం పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేశారు. తరచూ నమోదువుతున్న నేరాల గురించి ఆరా తీశారు. పెండింగ్ కేసుల సీడీ ఫైల్స్‌ను పరిశీలించి కేసుల పురోగతిని తెలుసుకుని తగిన సూచనలు ఇచ్చారు. రౌడీ షీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తుల వివరాలు తెలుసుకుని, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. అనంతరం స్థానిక పోలీసులతో ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు ముఖ్యంగా నిరుపేదలు, వృద్ధులు, మహిళల సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా సహకరించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాడంతో పాటు నేషనల్ హైవేలో వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. అలాగే చట్ట వ్యతిరేక కార్యక్రమాల కట్టడికి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీ బి.అప్పారావు, పాయకరావుపేట సీఐ పి.అప్పలరాజు, ఎస్ఐ బి.జోగారావు, ఏఎస్ఐ గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీఆర్ హబ్‌పై విచారణ

ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆదేశాలు

డీన్ ప్రొఫెసర్ మల్లిఖార్జునరావు నేతృత్వంలో కమిటీ

పీహెచ్‌డీ ప్రవేశాలు,గైడ్లుగా నియమితులైన వారి అర్హత పరిశోధన సాగిన తీరు వంటి అంశాలు పరిశీలన

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో గల ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్ (టీడీఆర్) వ్యవహారాలపై ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు విచారణకు ఆదేశించారు. గడిచిన ఐదేళ్లలో టీడీఆర్ హబ్‌లో భారీ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. అస్మదీయులైన వారికి అడ్డగోలుగా పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించారన్నది ప్రధానమైన ఆరోపణ. దానిపై వీసీ దృష్టిసారించారు. టీడీఆర్ హబ్‌లో జరిగిన వ్యవహారాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక అందించాల్సిందిగా ఆదేశించారు. ఇందుకు ప్రత్యేకంగా కమిటీని నియమించారు. టీడీఆర్ హబ్ డీన్‌గా ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్‌ను తొలగించి ఆ స్థానంలో ప్రొఫెసర్ మల్లిఖార్జునరావుకు బాధ్యతలు అప్పగించారు. ఆ కమిటీకి కూడా ఆయన నేతృత్వం వహిస్తారు. ఆయనతోపాటు శ్రీకాకుళం జిల్లా అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, విజయనగరం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, ఏయూ వాతావరణ, సముద్ర అధ్యయన విభాగాధిపతి ప్రొఫెసర్ సునీత, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ గోపీచంద్ నాయక్ సభ్యులుగా ఉంటారు. గడిచిన కొన్నాళ్లుగా టీడీఆర్ హబ్ ఆధ్వర్యంలో జరిగిన పీహెచ్‌డీ ప్రవేశాలు, అనుసరించిన నిబంధనలను కమిటీ పరిశీలించనున్నది. అలాగే, సుమారు 400 మందికి గైడ్లుగా అవకాశం కల్పించారు. వీరిలో ఏయూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు ఉన్నారు. అయితే, చాలామందికి అర్హతలు లేకపోయినప్పటికీ అవకాశం కల్పిం చారన్నది ఆరోపణ. గైడ్లుగా అవకాశం పొందేందుకు ఉన్న అర్హతలు వంటి అంశాలను పరిశీలించనున్నారు. ప్రస్తుతం 600 మంది పరిశోధకులు ఉన్నారు. వీరిలో కొందరు ఆర్‌సెట్ ద్వారా, మరికొందరు ఎగ్జిక్యూటివ్ కోటాలో ప్రవేశాలు పొందారు.ప్రవేశాలకు సంబంధించి అనుసరించిన నిబంధనలను కూడా పరిశీలించి నివేదిక అందించనున్నారు. టీడీఆర్ హబ్‌లోని గైడ్ల వ్యవహారంపై ప్రస్తుతం విచారణ సాగుతుండడంతో 2024-25 ఏడాదికి సంబంధించి పీహెచ్‌డీ ప్రవేశాలను వర్సిటీ ఉన్నతాధికారులు నిలిపి వేశారు. ఆర్‌సెట్ కన్వీనర్ టీడీఆర్ హబ్‌కు 172 పీహెచ్‌డీ సీట్లను కేటాయిస్తామని చెప్పినప్పటికీ..విచారణ పూర్త య్యేంత వరకు వద్దని చెప్పినట్టు వీసీ ప్రొఫెసర్ జి.శశి భూషణరావు వెల్లడించారు. ఈ వ్యవహారంపై నివేదిక వచ్చిన తరువాత అడ్మిషన్లు తీసుకుంటామన్నారు.

వ్యవసాయ పరపతి సంఘం.. నిర్వీర్యం!

- కొయ్యూరు పీఏసీఎస్‌లో పడిపోయిన లావాదేవీలు
- రాజకీయ ఒత్తిళ్లతో ఐదేళ్లుగా వసూలుకాని రుణాలు
- రూ.1.5 కోట్లకు పేరుకుపోయిన మొండి బకాయిలు



కొయ్యూరు పీఏసీఎస్ భవనం ఇదే..

కొయ్యూరు, ఆగస్టు 16: కొయ్యూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నిర్వీర్యమవుతోంది. వైసీపీ ప్రభుత్వ వైఖరి కారణంగా టర్నోవర్ పడిపోయింది. దీనికితోడు మొండి బకాయిలు పేరుకుపోయాయి.

కొయ్యూరులో సుమారు మూడు దశాబ్దాల క్రితం స్థాపించిన పీఏసీఎస్ రెండు దశాబ్దాల పాటు ఒక వెలుగు వెలిగింది. ఆరంభంలో రూ.10 చెల్లించి సుమారు ఎనిమిది వేలకు పైబడి రైతులు సభ్యులుగా చేరారు. 2019 వరకు ఈ సభ్యులే సంఘం నుంచి తక్కువ వడ్డీతో వ్యవసాయ రుణాలు పొంది పెట్టుబడులకు వినియోగించుకునేవారు. వ్యవసాయ సీజన్‌లో ఆర్థిక ఇబ్బందులును కొంత మేర అధిగమించి ధైర్యంగా ముందుకు సాగేవారు. అప్పటిలోనే వ్యవసాయ యాంత్రీకరణ చర్యల్లో భాగంగా సంఘ రైతులకు సీజన్‌లో దుక్కి, దమ్ము, విత్తనాలు జల్లుకోవటానికి, ఇతర వ్యవసాయ పనులకు అవసరమైన రూ.9 లక్షలు ఖర్చుతో ట్రాక్టర్‌ను అప్పటి ప్రభుత్వం సమకూర్చింది. ఈ ట్రాక్టర్‌ను అతి తక్కువ అద్దెతో వినియోగించుకుని వ్యవసాయ పనులు సకాలంలో నిర్వహించుకునే అవకాశం కల్పించింది. వచ్చిన అద్దె డబ్బులతో ట్రాక్టర్ మరమ్మతులు తదితర పనులు నిర్వహించుకునేవారు. దీని మరమ్మతులు తదితర పనులకు పీఏసీఎస్ నిధుల నుంచి వెచ్చించే అవకాశం లేకుండా నిర్వహణ బాధ్యత సంఘ చైర్మన్లు చూసుకునేవారు. ప్రస్తుతం సంఘానికి ఎన్నికలు నిర్వహించడంలో జాప్యం జరగడం, తరచూ ఈ సంఘాలకు అధికారం చేపట్టిన ప్రభుత్వాలు నామినేటెడ్ పద్ధతిలో చైర్‌పర్సన్‌లను నియమించడంతో ట్రాక్టర్ అద్దె వచ్చినా చైర్‌పర్సన్‌లు ఎవరికి అందినంత వారు దోచుకోవడమే కాకుండా సొంత అవసరాలకు వినియోగించుకుంటూ ఇష్టానుసారంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ట్రాక్టర్ మరమ్మతులకు నోచుకోక మూలకు చేరింది.



ఆరేళ్లుగా మూలకు చేరిన ట్రాక్టర్

అమాంతంగా తగ్గిన సభ్యులు

ఎనిమిది వేలకు పైబడి సభ్యులు ఉండే కొయ్యూరు పీఏసీఎస్‌లో ప్రస్తుతం 3,500కు తగ్గిపోయారు. దీనికితోడు గత ప్రభుత్వ హయాంలో సభ్యత్వం కోసం రూ.10 నుంచి అమాంతంగా రూ.300 పెంచడంతో సభ్యుల సంఖ్య అమాంతంగా దిగజారింది. అలాగే రూ.3.70 కోట్ల టర్నోవర్ ఉండే ఈ సంఘం రూ.1.5 కోట్లకు చేరింది. బకాయిల వసూలు కాకపోవడంతో టర్నోవర్ పడిపోయి ఉన్న సభ్యులకు వ్యవసాయ సీజన్‌లో కనీస పెట్టుబడులకు సైతం రుణాలు అందించలేని దుస్థితికి చేరింది. మొత్తానికి పీఏసీఎస్‌లో సిబ్బందికి జీతాలు లేకుండా, రైతులకు వ్యవసాయ సీజన్ వచ్చినా ఆర్థిక సహకారం అందించలేక నిర్వీర్యమయ్యే దుస్థితి దాపురించింది.

హోం మంత్రి నివాసంలో వరలక్ష్మీ వ్రతం



నివాసంలో వరలక్ష్మీ వ్రతం పూజలు చేస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, ఆగస్టు 16: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి తన నివాసంలో శుక్రవారం ఉదయం శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీదేవి వ్రతం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు శ్రీసూక్త విధానంలో అమ్మవారి పూజలు, కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి అనంతరం ధూపదీప నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. హోం మంత్రి అనిత కుటుంబసభ్యుల గోత్రనామాలతో పూజలు చేశారు. అనంతరం పలువుర ముత్తయిదువులకు హోం మంత్రి అమ్మవారి శేష వస్త్రాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలని, ప్రజలంతా ఆర్థిక ఇబ్బందులు లేకుండా అమ్మవారు కటాక్షించాలని కోరుకున్నానని చెప్పారు. అలాగే మండలంలోని అనేక గ్రామాల్లో వున్న అమ్మవారి ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. బంగారమ్మపేట, గొడిచెర్ల, ఉపమాక, నక్కపల్లి, సీహెచ్‌ఎల్‌పురం గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

నేవీ ప్రహారీ గోడ నిర్మాణం ఆపాలని ఆందోళన



వై లోవ రోడ్డుపై బైఠాయించిన గ్రామస్థులు

రాంబిల్లి, ఆగస్టు 16: నేవీ ప్రహారీ గోడ నిర్మాణ పనులు ఆపాలని డిమాండ్ చేస్తూ వై.లోవ గ్రామస్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ప్రహారీ గోడ పనులను అడ్డుకోవడంతో పాటు రోడ్డుపై బైఠాయించారు. ప్రహారీ గోడ నిర్మిస్తే తామెలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. వరదలు వస్తే పాడి పశువులు ఎక్కడ మేపుకోవాలని, వేసవిలో ఉపాధి పనులు ఎలా చేసుకోవాలని ఉదయం నుంచి రోడ్డుపైనే బైఠాయించిన నిరసన తెలిపారు. విషయం తెలిగాయనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో ఆట్లాడారు. తహసీల్దార్‌తో చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని గ్రామస్థులకు వారు సూచించారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని ఈ సందర్భంగా గ్రామస్థులు వాపోయారు. వారి ఆందోళనకు సీపీఎం మండల కన్వీనర్ జి.దేవుడు నాయుడు మద్దతు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్ది నారాయణరావు, ప్రజా ప్రతినిధులు యన్నం రెడ్డి శ్రీనివాసరావు, బద్ది నారాయణరావు, గ్రామ పెద్దలు బద్ది నర్సింగ్, ఆనంద్, శ్రీను, కృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లకు చేయూత

- మైక్రోస్మాల్ అండ్ మీడియం సంస్థ జేడీ శ్రీనివాస్



మాట్లాడుతున్న జేడీ శ్రీనివాస్

చోడవరం, ఆగస్టు 16: చిన్నతరహా పరిశ్రమలకు చెందిన స్వయం ఉపాధి యూనిట్లకు అవసరమైన సహకారమందిస్తామని మైక్రోస్మాల్ అండ్ మీడియం సంస్థ జాయింట్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక దివ్యాంగుల సంక్షేమ సంఘ భవనంలో దివ్యాంగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమలవుతుతున్న వివిధ పథకాలను చిన్నతరహా పరిశ్రమల యజమానులు ఉపయోగించుకోవాలన్నారు. ఇందుకోసం అవగాహనకు శిక్షణ ను కల్పిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు దుగ్గిరాల రవికుమార్, ఆర్క్ ప్రసాద్, ముక్కా రమేష్, పట్నాయక్, రిటైర్డ్ లెక్చరర్ ఎస్. దేముడు తదితరులు పాల్గొన్నారు.

నిధుల పెంపును జీర్ణించుకోలేక వైసీపీ విమర్శలు

- ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు ఎరుకునాయుడు



జీవో కాపీ చూపిస్తున్న ఎరుకునాయుడు

కె.కోటపాడు, ఆగస్టు 16: గ్రామ పంచాయతీలకు స్వాతంత్ర్య దినోత్సవానికి వెచ్చించే నిధులను కూటమి ప్రభుత్వం భారీగా పెంచిన విషయాన్ని వైసీపీ జీర్ణించుకోలేకే అసత్య ప్రచారం సాగిస్తోందని ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత 34 ఏళ్లుగా స్వాతంత్ర్య వేడుకల్లో మేజర్ పంచాయతీలకు కేవలం రూ. 250లు, మైనర్ పంచాయతీలకు రూ. 100 మాత్రమే ఖర్చు చేసుకునే అవకాశం ఉండేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పెద్ద పంచాయతీకి రూ. 25వేలు, చిన్న పంచాయతీకి రూ.10వేల చొప్పున వ్యయం చేసుకునేలా ఇటీవల జీవో జారీ చేశారన్నారు. దీనిని సహించలేక వైసీపీ అక్కసు వెల్లగక్కుతుందన్నారు. గతంలో జగన్ ప్రభుత్వ హయాంలో పంచాయతీలను చీకట్లో నెట్టి వేశారని, బ్లీచింగ్‌కు కూడా నయా పైసా ఖర్చు చేయలేని పరిస్థితి కల్పించారన్నారు.

CLASSIFIEDS

FLATS FOR SALE

★ Ready to Occupy 2BHK 1030 Sft East & West Facing Flats for Sale & Pollutions Free Zone in Highway Facing Layout at TAGARAPUVALASA, Cont : 9866746418. AJG_2136

PLOT FOR SALE

VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి మీ, బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీ గంధం, ఎర్రచందనం మొక్కలతో చ.గ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్. ఫామ్ హౌస్‌ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర. 78934 21245. AJB_59

APCRDA అప్రూవ్డ్ ప్లాట్స్ ORR- రింగురోడ్డు అనుకొని అమరావతి రాజధానికి, ఐకానిక్ బ్రిడ్జి దగ్గరలో గేటెడ్ కమ్యూనిటీ నందు కలవు. బ్యాంక్ లోన్. సంప్ర॥ 9014437611, 7730099126. AJG_9523

CHANGE OF NAME

★ I, Gajjala Anwita Reddy D/o Gajjala Rama Subhodaya Reddy, Resident of D-176, Parawada Mandal / Deepanjalinagar NTPC Simhadri Township, Anakapalli, Andhra Pradesh 531020. I have changed my name from Gajjala Rama Anwita Reddy (Old Name) to Gajjala Anwita Reddy (New Name) for all future purposes. AJH-1371

For Advertisement Contact : 9963231176 9966165093

COMMERCIAL SPACE FOR SALE

★ 4000 sft. (Comm.) in G.F. & 1250 sft. (3 BHK) in Fourth Floor at Gopalapatnam Main Road for Sale. Cont.: 9849116584 AJV_192582

CHANGE OF NAME

★ I, PALLA SAI PURUSHOTHAM REDDY S/O PALLA PENCHALA REDDY, R/o 97/200-4-31, Siva Sai Nagar, Utukur, Cuddapah, Andhra Pradesh - 516003 Have changed my Religion from HINDUISM to ISLAM RELIGION wef.13.08.2018 also changed my name to SHAIK MOHAMMED SAIF. AJH-54251

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి



నులిపురుగుల నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ దినేష్ కుమార్

నులిపురుగుల నివారణతో పిల్లల్లో ఆరోగ్యం

» జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్

పాడేరు రూరల్, ఆగస్టు 16: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులు నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖాధికారులతో కలిసి నులిపురుగుల నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఈ నెల 20వ తేదీన నిర్వహించాలన్నారు. డీవార్మింగ్ చేసిన పిల్లలకు ఈ నెల 28వ తేదీ వరకు ఆల్బెండైజ్ 400 మిల్లీగ్రాములు మాత్రమే వేయాలన్నారు. కడుపులో నులిపురుగులు ఉంటే పోషకాహార లోపం, రక్తహీనత వల్ల నీరసంగా, శరీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రైవేటు, ప్రాథమిక, యూపీ, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో, పాలిటెక్నిక్ కళాశాల, ఒకేషనల్, నర్సింగ్ కళాశాలల్లో, డిగ్రీక కళాశాలల్లో ఆల్‌బెండైజర్ మాత్రలను పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమీల్ బాషా, డీఈవో పి.బ్రహ్మాజీరావు, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, టీడబ్ల్యూ డీడీ ఐ.కొండలరావు, ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ వి.చిట్టబ్బాయి, ఆర్‌బీఎస్‌కే మేనేజర్ వై.కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తత అవసరం



రైతులకు తెగుళ్ల నివారణ మందులు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

చింతపల్లి, ఆగస్టు 16: పసుపు, మిరియాలు పంటల్లో తెగుళ్ల నియంత్రించుకునేందుకు రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని టాటా ట్రస్టు శాస్త్రవేత్త డాక్టర్ అప్పలరాజు సూచించారు. స్థానిక ఉద్యాన పరిశోధన స్థానంలో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్టు సంయుక్తంగా ఉద్యాన పంటల్లో వ్యాప్తి చెందే తెగుళ్లపై శుక్రవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో పసుపులో దుంపకుళ్లు, మిరియాలలో మొదలు కుళ్లు తెగులు వ్యాప్తి చెందుతాయన్నారు. వీటిని సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే పంటను నాశనం చేస్తాయన్నారు. ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ దుంపకుళ్లు, మొదలు కుళ్లు తెగుళ్లను ట్రైకోడెర్మా, సూడోమోనస్ మందుల యాజమాన్యంతో నియంత్రించుకోవచ్చునన్నారు. అనంతరం ట్రైకోడెర్మా, సూడోమోనస్ మందులను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు చలపతిరావు, నీరజ, బిందు పాల్గొన్నారు.

జ్వర బాధితులు రక్త పరీక్షలు చేయించుకోవాలి



వైద్య శిబిరంలో ఆరోగ్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ హిమబిందు

సీలేరు, ఆగస్టు 16: జ్వర బాధితులు తప్పనిసరిగా రక్త పరీక్షలను చేయించుకోవాలని ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు సూచించారు. ధారకొండ ఆరోగ్య కేంద్రం పరిధిలోని తోకరాయి గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 93 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఇందులో 20 మంది జ్వర బాధితులకు రక్త పూతలను సేకరించి పరీక్షలను నిర్వహించారు. జ్వర బాధితులు మలేరియా నిర్ధారణ కాలేదు. జ్వర బాధితులు వెంటనే ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. మలేరియా నిర్ధారణ అయితే క్రమంగా మందులు వాడాలన్నారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, గర్భిణులు సుపత్రిలోనే ప్రసవం అయ్యేలా అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీపీ మండల అధ్యక్షుడు శ్రీధర్ మృతి



శ్రీధర్ (ఫైల్)

చింతపల్లి, ఆగస్టు 16: ఐటీడీపీ మండల అధ్యక్షుడు సరమండ శ్రీధర్ (43) మృతి చెందాడు. లంబసింగి గ్రామానికి చెందిన శ్రీధర్ టీడీపీలో సామాన్య కార్యకర్త స్థాయి నుంచి జిల్లా, మండల స్థాయి పదవుల్లో పనిచేశారు. రెండేళ్లుగా ఐటీడీపీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. నెల రోజుల క్రితం జీర్ణాశయ వ్యాధితో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. గురువారం అర్థ రాత్రి ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. శుక్రవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీధర్ మృతదేహానికి పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, నాయకులు కిల్లో పూర్ణచంద్రరావు, అంద్రాబు లక్ష్మణ్, కోడా వెంకట సురేశ్, వెంకట రమణ, పాంగి రాము తదితరులు పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. శ్రీధర్ మరణం పార్టీకి తీరని లోటని గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ

... 3వ పేజీ తరువాయి

జిల్లాల్లో తహసీల్దార్లకు పోస్టింగ్ ఇచ్చేందుకు మార్గం సుగమం కానున్నది.

అందరికీ ధన్యవాదాలు: ఎమ్మెల్సీ బొత్స

శ్రావణ శుక్రవారం వంటి పవిత్రమైన రోజున ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీగా ధ్రువీకరణపత్రం అందుకున్న తరువాత విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తామని పేర్కొన్నారు. బొత్స వెంట రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు, నాగిరెడ్డి, అదీప్‌రాజ్ ఉన్నారు.

నేడు వైద్య సేవలు బంద్

... 3వ పేజీ తరువాయి

ప్రభుత్వ వైద్యుల సంఘం కూడా బంద్‌కు మద్దతు తెలిపిన నేపథ్యంలో ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని కేజీహెచ్, ఘోషా, ఈఎన్‌టీ, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, మానసిక వైద్యశాల, విమ్స్‌లో రోగులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. కేజీహెచ్‌లో క్యాజువాల్టీ సేవలకు 16 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 26 మంది ప్రీ పారామెడికల్ డాక్టర్లు, ఓపీ విభాగాల నిర్వహణకు అనుగుణంగా ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఏర్పాటుచేశారు. శస్త్ర చికిత్సల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా 28 మంది అనస్థీషియన్‌లను అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సెలవులు రద్దు చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద తెలిపారు. విమ్స్‌లో 30 మంది వైద్య నిపుణులు అందుబాటులో ఉంచినట్టు రాంబాబు తెలిపారు.

ప్రత్యేక శ్రద్ధతోనే బాల్య వివాహాల నియంత్రణ

» జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్



అధికారులతో సమావేశమైన జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్

పాడేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అధికారుల ప్రత్యేక శ్రద్ధతోనే బాల్య వివాహాలను నియంత్రించగలమని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయి కమిటీతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా డ్రాపవుట్ విద్యార్థులను గుర్తించడం ద్వారా బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. ఆ దిశగా డ్రాపవుట్‌లను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని డీఈవోను ఆదేశించారు. అలాగే బాల్య వివాహలు జరిగే ప్రాంతాలను ముందుగా గుర్తించాలని, అందుకు గల కారణాలపైనా దృష్టిసారించాలని సూచించారు. ఆదిమజాతి గిరిజనుల సంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూనే బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామాల్లో 11 నుంచి 18 ఏళ్ల బాలికలను గుర్తించి వారితో సఖి గ్రూపులను ఏర్పాటు చేసి బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు. బాల్య వివాహాల కారణంగా జరుగుతున్న మాతాశిశు మరణాలను ఉదహరిస్తూ బాలికల్లో అవగాహన పెంచాలన్నారు. తమ పరిధిలో ముందుగా గుర్తించి 12 బాల్య వివాహాలను అడ్డుకున్నామని, ప్రస్తుతం వారిలో ఏడుగురు బాలికలు చదువుకుంటుండగా మిలిగిన వారు ఇళ్లలో ఉంటున్నారని కమిటీ కన్వీనర్ ఝాన్సీలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డీఎంహెచ్‌వో డాక్టర్ సి.జమాల్‌బాషా, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డీపీఆర్‌వో పి.గోవిందరాజులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.నవీన్‌కుమార్, డ్వామా పీడీ శివయ్య, వెలుగు ఏపీఎం జె.చిన్నారావు, సచివాలయల సమన్వయకర్త సునిల్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా అదనపు టీచర్లు

» గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు



మేడూరులో గిరిజనులతో మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు

చింతపల్లి/గూడెంకొత్తవీధి, ఆగస్టు 16: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా అదనపు ఉపాధ్యాయులను నియమిస్తామని డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు తెలిపారు. శుక్రవారం చింతపల్లి, జీకే వీధి మండలాల్లో పర్యటించిన డీడీ మేడూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జర్రెల బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. మేడూరు గ్రామంలో విద్యాబోధనపై ఆదివాసీలను అడిగి తెలుసుకున్నారు. జర్రెల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థినీ, విద్యార్థుల విద్యా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు కెరీర్ గైడెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతులను బోధించనున్నట్టు చెప్పారు. ఇందుకోసం ముగ్గురు ఉపాధ్యాయులను కెరీర్ గైడెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులకు రోజుకు ఒక పీరియడ్‌ను బోధన చేస్తారన్నారు.

పదో తరగతి, ఇంటర్మీడియేట్ తరువాత ఎటువంటి విద్యా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి? ఏ కోర్సులు చదవాలని తదితర సమగ్ర సమాచారం బోధిస్తారనే అంశాలపై డీడీ కొండలరావు ఆరా తీశారు. పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులను అదనపు నైపుణ్యాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే మెరుగైన చికిత్స అందించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయనాగ లక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రత కుంకుమార్చనలు

» భక్తులతో రద్దీగా మారిన మోదకొండమ్మ ఆలయం

పాడేరు రూరల్, ఆగస్టు 16: శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా మోదకొండమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను చేపట్టారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమార్చన, ప్రత్యేక పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.కోటిబాబు, ఆలయ కమిటీ తాజా మాజీ ప్రధాన



మోదకొండమ్మ ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



మోదకొండమ్మ దర్శనానికి బారులు తీరిన మహిళా భక్తులు

కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, సభ్యులు రమాదేవి, కొట్టగుళ్లి రామారావు, వి.రాజబాబు, కె.రాము, ఎస్.రామకృష్ణ, కె.భాగ్యలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: మండలంలో వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుటుంబ సమేతంగా ప్రత్యే పూజలు చేశారు. ఇళ్లలో అమ్మవారి ఫొటోలు, ప్రతిమలు ఉంచి మండపాలను ఎంతో అందంగా అలంకరణ చేశారు. అలాగే మండలంలో గల సుజనకోట, జోలాపుట్టు, చురువుపాకల, దారెల తదితర గ్రామాలలో గ్రామ దేవతల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు.

కూరుకుపోయిన 104 వాహనం



గూడెంకొత్తవీధి, ఆగస్టు 16: మండలంలోని రింతాడ పంచాయతీ ఇంద్రనగర్ కొత్తూరు సమీపంలో 104 వాహనం బురదలో కూరుకుపోయింది. దీంతో వైద్య సిబ్బంది సకాలంలో గమ్య స్థానానికి చేరుకోలేకపోతున్నారు. శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్ ఇంద్రనగర్ కాలనీలో ఏర్పాటు చేసేందుకు 104 వాహనంలో వైద్యసిబ్బంది ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో వాహనం బురదలో కూరుకుపోయింది. దీంతో స్థానికుల సహాయంతో సుమారు మూడు గంటలు శ్రమించి డ్రైవర్ వాహనాన్ని బయటకు తీశారు. దీంతో స్థానిక ప్రజలు రింతాడ నుంచి ఇంద్రనగర్ కాలనీ వరకు మట్టి రోడ్డు మాత్రమే ఉందని, నాలుగు చక్రాల వాహనాలు, అంబులెన్సులు వచ్చే దుస్థితి లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మించాలని కోరారు.

పోడు వ్యవసాయ పనుల్లో గిరిజనుల బిజీబిజీ



అనంతగిరి, ఆగస్టు 16: ఏజెన్సీ వ్యాప్తంగా కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గిరిజనులు సాగుపై దృష్టి సారించారు. సాగుకు వర్షాలు అనుకూలించడంతో పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. మండలంలోని బొడగుడ గ్రామ సమీపంలోని గిరిజనులు కొండవాలను అనుకుని, గిరిజనులు సామాలు వేసేందుకు సిద్ధమైయ్యారు. వర్షానికి భూమి మెత్తబడడంతో చేతితోనే నాగలి పట్టుకుని, దున్నుతూ నాట్లు వేస్తున్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలని ఆందోళన



రహదారి సౌకర్యం కల్పించాలని నిరసన తెలుపుతున్న స్థానికులు

జి.మాడుగుల, ఆగస్టు 16: మండలంలోని కోరపల్లి పంచాయతీ సుర్తిపల్లిలో రహదారి సదుపాయం కల్పించాలని అక్కడి గిరిజనులు కోరుతున్నారు. గ్రామంలో సుమారుగా 50 కుటుంబాలు అది నుంచి జీవనం సాగిస్తున్నామని, రహదారి సదుపాయం లేక అత్యవసర సేవలకు డోలీలు సహాయం తప్పడం లేదని వాపోయారు. గత ప్రభుత్వంలో అనేకసార్లు దరఖాస్తులు చేసిన ఫలితం కానరాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రహదారితో పాటు మౌలిక సదుపాయాలు కల్పిందని వారు చెప్పారు.

డిసెంబరులోగా సెల్ టవర్లు ఏర్పాటు

... 3వ పేజీ తరువాయి

తీసుకువచ్చారు. ఈనెల 27న జిల్లా స్థాయి సమావేశంలో వాటిపై చర్చించి, పరిష్కరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే జియో టెలికాం సంస్థకు 465 టవర్లు కేటాయించామని, 396 టవర్లకు సిగ్నల్స్ ఇవ్వగా ఇంకా 69 టవర్ల పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 29 టవర్ల నిర్మాణం పూర్తికాగా, 25 గ్రౌండింగ్ కాలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న మొత్తం 69 టవర్లను ఎప్పటి పూర్తి చేస్తారని కలెక్టర్ ప్రశ్నించారు. పనులు వేగవంతం చేసి వాటిని ఈ ఏడాది అక్టోబరు నెలాఖరుకు పూర్తి చేస్తామని జియో నెట్‌వర్క్ అధికారులు తెలిపారు. అలాగే ఎయిర్‌టెల్ 112 టవర్లకు 107 పూర్తికాగా, మిగిలిన ఐదు టవర్లను ఈనెలాఖరుకు పూర్తి చేస్తామని ఎయిర్‌టెల్ అధికారులు వివరించారు. అలాగే ఆప్టికల్ ఫైబర్ కేబుళ్ల వేసేటప్పుడు రోడ్లు పాడవకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆయా పనుల పర్యవేక్షణకు అవసరమైతే తమ ఇంజనీర్లను భాగస్వామ్యం చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎట్టిపరిస్థితుల్లో రోడ్లు దెబ్బతినకుండా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, బీఎస్ఎన్ఎల్ డీజీఎం (ప్రాజెక్టులు) ఆర్.శ్రీకాంత్ పట్నాయక్, డీజీఎం(ఈబీ అండ్ టీఎస్) ఎం.సత్యప్రసాద్, ప్రాజెక్ట్ డీఈ కేవీబీ.గంగాధర్, జియో అధికారులు సత్య, సూర్య ఎయిర్‌టెల్ అధికారులు వర్చ్‌వల్‌గా తదితరులు పాల్గొన్నారు.

అరకులో ఉపాధి కూలీల సందడి



కూలీలతో రద్దీగా ఉన్న అరకులోయక కేంద్రం

అరకులోయ, ఆగస్టు 16: మూడు రోజులుగా వరుస సెలవులు రావడంతో పలు ప్రాంతాల నుంచి ఉపాధి కూలీలతో మండల కేంద్రానికి తరలి వచ్చారు. ఉపాధి పథకం కింద గ్రామాల్లో చేసిన పనులకు బకాయిలు (కూలి సొమ్ము) బాంకు ఖాతాలలో జమ కావడంతో మండల కేంద్రాలలో ఉన్న నెట్ సెంటర్లు వద్ద పెద్ద ఎత్తున వందలాది మంది కూలీలు డబ్బులు విత్‌డ్రాలు చేసుకునేందుకు బారులు తీరారు. దీంతో నెట్ సెంటర్లు ఉపాధి కూలీలతో కిక్కిరిసిపోయి కనిపిస్తున్నాయి. నెట్ సెంటర్ల వారికి వ్యాపారం, ఒకేమారు ఆరు వారాల కూలి మొత్తం జమ కావడంతో సెల్‌ఫోన్ దుకాణాలు, ఇతర వస్త్ర, కిరణా, ఫ్యాన్సీ, హోం నీడ్స్ దుకాణాలలో వ్యాపారాలు జోరుగా జరుగుతున్నాయి.

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు రూరల్, ఆగస్టు 16: పాడేరు డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్‌ల మరమ్మతుల కోసం 17వ తేదీ శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎస్ఎం.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ముంచంగిపుట్టు సబ్ స్టేషన్ పరిధిలోని మాకవరం ఫీడర్ పరిధిలోని కించాయిపుట్టు, దారాపల్లి, సరియాపుట్టు, రంగబయలు, మజ్జిగూడ గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. చింతపల్లి సబ్ స్టేషన్ లోతుగెడ్డ ఫీడర్ పరిధిలోని రుడిగెడ్డ జంక్షన్, వంగసార, చిన్నగెడ్డ గ్రామాలకు, కొయ్యూరు మండలంలోని 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు కారణంగా కృష్ణాదేవిపేట, కాకరపాడు, ఐటీడీఏ కాలనీ, సింగవరం, మంప, దొడ్డవరం, చింతలపూడి, ఎం.మాకవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గుర్తించి విద్యుత్ శాఖాధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

22 నుంచి డిగ్రీ ప్రవేశాలకు కౌన్సెలింగ్

చింతపల్లి, ఆగస్టు 16: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 22న రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం కానున్నదని ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ డిగ్రీలోని వివిధ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 23 నుంచి 25 వరకు ధ్రువపత్రాల పరిశీలన, వెబ్ ఆప్షన్, 26న మార్పులు ఉంటాయన్నారు. 29న సీట్ల కేటాయించడం జరుగుతుందని, 30 నుంచి సెప్టెంబరు 3వ తేదీలోగా కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుల తుది జాబితా సమర్పించాలి

పాడేరు రూరల్, ఆగస్టు 16: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల గుర్తింపు తుది జాబితాను ఈ నెల 22వ తేదీ నాటికి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలని డీఈవో పి.బ్రహ్మాజీరావు సూచించారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2024కు సంబంధించి జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులు, హెచ్ఎంలకు, ఎంఈవోలకు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ అవార్డులకు 15 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు మాత్రమే అర్హులన్నారు. మండల, డివిజన్ స్థాయిలో దరఖాస్తులను పరిశీలించి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశాకే తుది జాబితాను పంపించాలని సూచించారు. అవార్డుల విషయంలో పొరపాట్లు జరగకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత మండల, ఉప విద్యాశాఖాధికారులపైనే ఉందన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారానికి బీజేపీ వారధి దోహదం

పాడేరు రూరల్, ఆగస్టు 16: రాష్ట్రంలో సమస్యల సత్వర పరిష్కారానికి బీజేపీ చేపడుతున్న వారధి కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పి.రవికుమార్ అన్నారు. విజయవాడ రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన వారధి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మన్యం సమస్యల పరిష్కారం కోరుతూ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి వినతిపత్రం అందించామన్నారు. అల్లూరి జిల్లాలో కొంత కాలంగా ఆస్పత్రులలో జరుగుతున్న గర్భిణులు, చిన్నారుల మరణాలు, ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ఆరోగ్య సిబ్బంది నియాకం తదితర సమస్యలు పరిష్కారం కోసం వినతిపత్రం అందించామన్నారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.సుబ్రహ్మణ్యం, బి.చిరంజీవి, కె.శ్రీనివాసరావు, కె.శేఖర్ పాల్గొన్నారు.

వాజ్‌పేయికి ఘన నివాళి

పాడేరు రూరల్, ఆగస్టు 16: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 6వ వర్ధంతి కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ వాజ్‌పేయి ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. దేశాభివృద్ధికి, పార్టీ బలోపేతానికి వాజ్‌పేయి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.ఈశ్వరరావు, కె.రాజారావు, కె.చిన్నయ్య, కె.అనంతయ్య, పి.సురేష్, కె.గణేష్, దేవేందర్ పాల్గొన్నారు.

గుళి పద్ధతిలో సాగు ఎంతో మేలు

చింతపల్లి, ఆగస్టు 16: ఆదివాసీ రైతులు రాగి పంటలో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించేందుకు గుళి పద్ధతిలో సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సూచించారు. పెదబరడ గ్రామంలో శుక్రవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఆదివాసీ రైతులతో మాట్లాడుతూ వరి, చిరుధాన్యాల సాగులో రైతులు శాస్త్రీయ ఆధునిక పద్ధతులు పాటించాలన్నారు. వరుసల పద్ధతిలో వరి నాట్లు వేసుకోవడం వల్ల మంచి దిగుబడి వస్తుందన్నారు. రాగిలో గుళి పద్ధతిలో సాగు చేసుకుంటే రెట్టి దిగుబడులు వస్తాయన్నారు. గుళి పద్ధతిపై రైతులకు క్షేత్ర ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పంటలకు సమగ్రపోషణ యాజమాన్యం, నీటి యాజమాన్యం పాటించాలన్నారు.

కనెక్టువిటీ రోడ్లు నిర్మించాలి

చింతపల్లి, ఆగస్టు 16: ఐటీడీఏ పరిధిలో శివారు గిరిజన గ్రామాలకు కనెక్టువిటీ రోడ్లు నిర్మించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు తెలిపారు. శుక్రవారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో విశాఖ దక్షిణ నియోజక వర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్‌కు జనసేన నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు గ్రామాలకు రహదారుల సదుపాయంలేక రోగులు, గర్భిణులను డోలీపై ప్రధాన గ్రామాలకు తీసుకురావాల్సి వస్తుందన్నారు. రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. చింతపల్లి, పాడేరు ఆస్పత్రుల్లో పూర్తి స్థాయి వైద్యులను నియమించాలని, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

ఆటో అపహరణపై పోలీసులకు ఫిర్యాదు

డుంబ్రిగుడ, ఆగస్టు 16: మండల కేంద్రంలో ఆటో అపహరణకు గురైందని కమ్మిడి భాస్కరరావు తెలిపారు. ఇంట్లో నుంచి భోజనం అనంతరం వచ్చి చూడగా ఆటో కనిపించలేదన్నారు. చుట్టు పక్కల గాలించినా కనిపించలేదన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆటోపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు అపహరణకు గురవ్వడంతో కుటుంబ రోడ్డు పడిందని బాధితుడు లబోదిబోమంటున్నారు.